# ఉలూచి

అర్జునుడు తీర్థ యాత్రలకు బయలుదేరాడు. తనతోపాటు వేద వేదాంగ పారంగతులైన శాస్త్ర విదులనూ, కథా కథన దక్షులైన పౌరాణికులను వెంట తీసుకుని ప్రయాణం సాగించాడు.

మార్గాయాసం లేకుండా అందరితోనూ మధ్య మధ్య విశ్రాంతి తీసుకుంటూ, కుతూహలంతో పురాణ కథలు వింటూ, పుణ్యతీర్థ ప్రదేశాలు సేవిస్తూ, ప్రకృతిని తిలకించి పరవశిస్తూ ముందు ముందుకు సాగుతున్నాడు ఉత్సాహంగా అర్జునుడు.

గంగా తీరం చేరిన అర్జునుని మనసు ఆనంద తరంగాల్లో ఊగిసలాడింది. పరమ పావనీ, పాపహారిణీ అయిన ఆ గంగామతల్లి మాహాత్మ్యాన్ని కొనియాడారు. ఈ పుణ్య భాగీరధీ తీరాన కాలం గడుపుతూ, తపోనిష్ఠాపరులైన మహర్షు లెంత ధన్యులో అనిపించింది అతనికి.

ప్రతినిత్యం గంగా స్నానం చేస్తున్నాడు. హోమం కాలుస్తున్నాడు. పితృ దేవతలకి తర్పణాలు వదులుతున్నాడు. ఆ గంగా జలాలను వదిలిపో బుద్ధి పుట్టటం లేదు అర్జునునికి.

అది ప్రభాత సమయం. దిక్కులన్నీ వింతకాంతుల్ని నింపుకుంటు న్నాయి. ఉదయ సూర్య కిరణాలు నదీ జలాలపైన పడటంతో ఆ నదీ జలాలు మిలమిలా మెరుస్తున్నాయి. ఉదయ సంధ్యాకాంతులు తూర్పు దిక్కున ప్రసరి స్తుంటే, నదిపైనుంచి వచ్చే పిల్లగాలులు, అక్కడి వృక్ష సంపద, ఆ వృక్షాలపై నుంచి వినవచ్చే పక్షుల కిలకిలా రావాలు-అన్నీ అర్జునుణ్ణి పరవశింప జేస్తున్నాయి.

రోజూలాగా ఆనాడు ప్రభాత సంధ్యలో గంగాస్నాన మాచరించాడు. సూర్యు నారాధించాడు. అగ్ని కార్యం ప్రారంభించదలచాడు. హోమం చేయ సంసిద్ధుడయ్యాడు.

ఆ అగ్ని హోత్రపు వెలుగులో అర్జునుడు భాసిస్తున్నాడు. అతని శరీరపు నిగనిగలు ఆ కాంతితో మరీ ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. స్వర్గాధిపతిని మించిన రాజఠీవి అతని ముఖంలో ద్యోతకమవుతోంది. విశాలమైన వక్షస్థలం,

కొస దేరిన నాసిక, శరీర దారుఢ్యం ఆ గంభీర మూర్తి సౌందర్యానికి మరింత వన్నె చేకూర్చాయి. ఎంద రెందరు మహాత్ములు ఈ నదిలో స్నానమాడలేదూ, ఎంద రెందరు మహర్షులు ఈ నదిలో మునక తీయలేదు. కానీ, ఈనాడెందుకో తన మనసు తనకి లొంగటం లేదు. తనతో బాటు అతన్ని తీసికెళ్ళిపోవాలి. ఇక ఒక్క క్షణం తను ఆలస్యం చేయకూడదు, ఈ మన్మథాకారుణ్ణి తన బాహు పంజరంలో బంధించి, తన భవనంలో దాచుకోవాలి. ఇంత కాలంగా అతన్ని ప్రేమిస్తూ, ఈనాడు ఒంటరిగా ఉన్న అతన్ని తన లోకానికి తీసుకెళ్ళటానికి తను వెనుకాడటం తగదు- నాగకన్య తన మనసులో పరి పరి విధాల ఆలోచిస్తూంది. తగిన సమయం కోసం నిరీక్షిస్తోంది.

అర్జునుడు హోమం మొదలు పెట్టాడు. అమాంతంగా అతన్ని అక్కడ నుంచి తనతో పాతాళానికి కొనిపోయింది నాగకన్య. అక్కడే హోమం ఏర్పాటు చేసింది. అగ్ని కార్యం పూర్తి చేసిన అర్జునునికి ఇదో కొత్త అనుభూతి.

తానెక్కడున్నాడు? తను రోజూ దర్శించే పవిత్ర భాగీరథీ తీరమేది? తనతో వచ్చిన వేద పండితులు, పౌరాణికులు ఏరి? ఈ అందమైన భవనంలోకి తాను ఎలా వచ్చాడు? అర్జునునికి ఇది భ్రాంతా, నిజమా తెలియటం లేదు.

ఆరాధనా భావంతో అతని వంక చూస్తున్న స్త్రీమూర్తిని చూసి విస్తుపోయాడు క్షణం.

ఇంతకు ముందే ఇతని గుణగుణాలు, రూప సౌందర్యాలు గీతాలుగా తన వారు పాడగా విందామె. అతన్ని గంగానదిలో స్నానమాడుతున్నపుడు స్వయంగా వీక్షించింది. తన ప్రేమ ఫలించాలని తాను ఎంతగానో కాంక్షించింది. ఇంత కాలానికి ఏ దేవతో తనని కనికరించింది. తన అదృష్టం రూపు దాల్చిందా అన్నట్టు ఇతను తనకు లభించాడు. తన భవనంలో దాచుకుంది. ఇక్కడి నుంచి కదలనీయదిక. తనెంత ధన్యురాలు!

ఆనందంతో తబ్బిబ్బయింది ఆమె.

అతన్ని క్రీగంట చూస్తుంటే, అర్జునుడు మందస్మితుడై "ఎవరు నువ్వు? నన్నిక్కడికి ఎందుకు తెచ్చావు?" అన్నాడు ఆ లోకమంతా పరిశీలనగా చూస్తూ.

"నేను నాగకన్యను. ఉలూచిని. ఇంతకు ముందు నీ కోసం ఎదురుచూసి, నీ గుణగణాలు రాగాలాపన చేశాను. ఇప్పుడు అనురాగంతో నా భవనానికి తెచ్చుకున్నాను." ఉలూచి ప్రేమైక దృష్టులు సారించింది అర్జునునిపైన.

అమె నల్లని కేశపాశం నడుముపైన నిగనిగలాడుతూ నాట్యమాడింది. ఆమె కళ్ళు మణి దీపికల్లా మెరుస్తున్నాయి. ఆమె ఎర్రని పెదాలు మధురంగా కదులుతుంటే, చిత్రంగా ఆమెకేసి చూస్తూ చిరునవ్వు నవ్వాడు అర్జునుడు.

ఆమె మనసు అర్థమైంది. తనని ప్రేమించి, వరించమని కోరుతోంది. కానీ, ఇదెలా సాధ్యం? వ్రతదీక్షాపరుడైన, తీర్థయాత్రార్థి అయిన తను ఉలూచి కోరిక తీర్చటం అధర్మం. ఈమె ప్రేమను తను స్వీకరించలేడు. నియమాన్ని ఉల్లంఘించలేడు. అర్జునుని భ్రుకుటి ముడిపడింది.

అక్కడ నిశ్శబ్దం తాండవించింది. ఉలూచి తలెత్తి అతని వంక చూసింది.

అతని నియమ నిష్ఠలు, వ్రతదీక్ష తనకి తెలుసు. కానీ, తన ప్రేమ సఫలం కాకపోతే తాను జీవించలేదు. ప్రాణ త్యాగం తప్పదు. ఎంత కాలంగానో ఎదురుచూస్తున్న ఈ వ్యక్తి, తన మనసులో నిండిపోయిన ఈ వ్యక్తి తనని కాదని వెళ్ళిపోతే? ఉలూచి కళ్ళలో నీళ్ళు నిలిచాయి. ఆమె కళ్ళలో బేలతనం, నిస్సహాయత అర్జునునికి బాధ కలిగించాయి. అతని నియమం అతన్ని వ్రత దీక్షాబద్ధుణ్ణి చేస్తోంది.

ఇటు నియమం, అటు తన పొందుకోరే ప్రేమికురాలు.

"నా నియమం సడలించలేను."

అర్జునుని మాటలు వినగానే నవ్వింది ఉలూచి.

"నీ సర్వతీర్థాగమనం, నీ వ్రత దీక్ష! నీ ధర్మవర్తన మొదలైనవన్నీ ప్రాణ దానంతో సమానం కావుగా?"

ఉలూచి అర్జునునికి చాలా చేరువ కొచ్చింది.

"ప్రాణ దానమా?" ఆశ్చర్యపోయాడు అర్జునుడు.

"అవును. నువ్వు నన్ను స్వీకరించకపోతే, విఫలప్రేమికురాలిగా జీవించలేను. అసలు మన్మథాగ్నే నా ప్రాణాలు తీస్తోంది. నీ చేత తిరస్కృతమైన ఈ తనువు, మనసు నాకక్కరలేదు. నేను ప్రాణత్యాగం చేయటం తథ్యం."

ఉలూచి గొంతు గాద్గద్యమైంది. ఆమె కన్నీటిబొట్లు అర్జునుని పాదాల పైన పడ్డాయి.

"ఈ ప్రేమార్తను రక్షిస్తే వ్రత భంగం కాదు."

నాగకన్య దీనాలాపం అర్జునుని గుండెలోతుల్ని చేరింది.

అర్జునుడు సానునయంగా ఉలూచి వంక చూశాడు. నాగలోకం మణుల కాంతితో ధగధగ లాడింది నాగకన్య మనసు ఆనందంతో ఉక్కిరి బిక్కిరైంది. ఆ రాత్రి ఉలూచి అంతఃపురమే అర్జునుని శయనాగారమైంది.

మనోహరుడై, పరాక్రమవంతుడై, మహావీరుడైన అర్జునుని పొందుతో సద్యో గర్భం దాల్చింది ఉలూచి.

నాగలోకాన్ని వదిలివెళ్ళిపోతున్న అర్జునుని చూస్తూ, ఒడిలో ఉన్న పసికందు ఇరావంతుణ్ణి గుండెలకు హత్తుకుంది నాగకాంత ఉలూచి. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభా రతం
ఆదిపర్వం : అష్టమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 16-3-1988)